“ఎచ్చటకు పోతావీ రాత్రి?
అవతలి గట్టుకు”

# మృత్యువు చాటు నీడలు

“చంద్రుడు”

వెలుతురులో నాలుగునాళ్లు బతకలేని మనం నీడల్లోకి తప్పుకుని తప్పుకుని బతుకుతున్నాం. ఈ వెలుతు రెరగని బతుకులో ఏమి స్వారస్యంవుంది? మన మీదినుంచి మృత్యువు దాటిపోతేగాని, తెర వదిలిపోయి అవతలి వెలుతురు మనమీదికి రాదు. అప్పటిదాకా మృత్యువు చాటు నీడల్లో బతకంది తప్పదు.

“నేను తెర జరుపుతాను. నువ్వు ఇటు తిరిగి కొంత వెలుతురు చూడు. చీకట్లని మరిచిపోవాలంటే అదే దారి. నీవు ఇన్నాళ్లూ బతికింది స్వప్నలోకంలో. ఇవతలికి వస్తావా? తెర జరపనా!” అన్నాడు యముడు నల్లనిదేహంతో చల్లనికళ్ళతో.

మంచంలో పడుకుని ఎదురుగా యముణ్ణి చూచింది ఆవిడ. ఆవిడకు యముణ్ణి చూస్తే భయం వేయలేదు కాని, తెర జరిపేస్తానంటే మాత్రం కొంత బాధ వేసింది.

“తెర ఇవతల నా తల్లీ తండ్రీ బంధువులూ, నన్ను మనసారా ప్రేమించిన నా వాళ్ళూ వుంటే, వీళ్ళనుండి నన్ను విడదీసి వెలుతురు చూపితే ఏం లాభం? నన్ను వీళ్లు లేని లోకంలోకి జరిపి వెలుతురు చూపినా లాభంలేదు. అమృతం తాగించినా రుచించదు. వీళ్లంతా నాకోసం గుండెలు కన్నీళ్లుగా కరిగేదాకా ఏడుస్తున్నారు. వాళ్ల యేడుపులో నా బతుకు పన్నీరై జారిపోతున్నది. వాళ్ల మనస్సులు పరిమళించడానికైనా నన్ను తెర ఇవతలే వుండనీ రాదూ?” అన్నది ఆ నెల ప్రాయపు పడుచు కోగళయ్యనుండి మెల్లిగా.

యముడు పక్కవాటుగా చూచి, ఆమె భుజం మీది పైటను రెపరెపలాడించే సాయంత్రపు గాలిలోని మృత్యువు గుసగుస విన్నాడు. పుట్టిననాటినుంచీ భటుడి మాదిరి మానవుణ్ణి కనిపెట్టుకుని వుండే మృత్యువు, మానవుడిమీది నుంచి అంతుపోయి భటుడు ఇక వెన్నాడ నక్కరలేదన్నాక, తనకు విశ్రాంతి లభించినట్టు భావించి ఆమనిషిని వదిలేసి వెళ్ళిపోతుంది. మృత్యువు మనని వదిలేసేప్పటికి ఈభూమినుంచి విడిపోయేశక్తి వెంటనే మనకు సంక్రమిస్తుంది. మనం రెక్కలు కట్టుకుని చంద్ర గోళాలవైపు పోతాం కాబోలు!

“అమ్మాయీ! నీ బంధువుల కన్నీళ్ళకు కరిగే నీ చీకటి గుండెకు అవతలి వెలుతురు కనపడితే బావుండును. అప్పుడు నీవు ఈ మాటలనవు. అప్పుడు నీకు ఈ స్వప్నంలో కనపడ్డ వాళ్ళంతా ఒక్క ఆవలింతతో, ఒక్క కనువిప్పుతో అదృశ్యమవుతారు. అప్పుడు నీ ఈ స్వప్నపు బతుకు ఉండిపోతుంది. నిజంగా తెల్లవారి, లోకం వెలుతురుగా కనపడుతుంది. నా వెంట కొంత ఈతెర ఇవతలికి అడుగు వేయరాదూ! నీవు కదల్లేకపోతే నా రథం నిన్ను అవతలకి చేరవేస్తుంది. తెరలేచి పోతుంది. అంతా వెలుతురు” అన్నాడు యముడు కడు మెల్లిగా.

“బాబూ! నువుచెప్పేది నాకు నచ్చకకాదు నేను వెనకాడుతున్నది. నాకు ఈ చీకటే బాగున్నప్పుడు వెలుతురులోకి ఎందుకు లాగుతావు?... ఇక్కడే నా నివాసం నా బంధువులకు హాయినిస్తుంది. నా హృదయాన్ని ప్రేమించిన ఆప్తులున్నారు. వాళ్ళని ఎలా కాదని నేను వెలుతురులోకి రాను? చెప్పవూ నాకు నీమాటల్లోని లోతులు బాగా తెలీవు కాని, నా ఆప్తులని విడిపించి నేను అవతలికి రాలేను. నాగుండె ఝణుకుతూన్నది. నా కళ్లు కరిగిపోతున్నవి. ఈ జీవితనౌకని మృత్యుసాగరంలో ఎందుకు ఈడిస్తావు. నీకు పుణ్యం

వుంటుంది ఇలా వుండనీ!" అంది ఆవిడ వణుకుతూ.

"పిచ్చిపిల్లా! నీ ఈ పిరికి వణకడం ఏమిటి? నేను నిన్ను బాధించడానికి వచ్చానా? నా మాటలు నీకు బాధ కలిగిస్తే అది నా సంభాషణలోని లోపమే కాని భావనాలోపకం కాదు. నిన్ను బాధించేచోటుకి పంపడానికి రాలేదు. చీకటిని తెల్లవార్చడం నా విధి. నీ బ్రతుకులో రాత్రి అయిపోతూన్నది. ఇక తెల్లవారకుంటే ఎట్లా. తెల్లవారనీరాదూ? తెల్లవారితే, ఈ స్వప్నాలు పూరికే వదిలిపోతై. ఏటికి స్నానానికి వచ్చినవాళ్లు ఇవతలి ఒడ్డు చూడటానికి భయపడి వెళ్ళిపోతారా! ఇటూ చూచి పోరాదూ! నీకు వెలుతురు బాగులేకపోతే, మళ్ళీ తెఅ దించటానికి వాగ్దానం చేస్తున్నాను. నీకు చీకటే నచ్చితే మళ్లీ నీడల్లోకి తప్పుకో. కలలుకంటో బతుకు. నాకేమీ అభ్యంతరం లేదు. కాని, నీకు వెలుతురు చూపించడం నా విధి" అని సముదాయించాడు యమరాజు ఆమెని.

యముడి మాటల్లో ఆమెకి పెద్ద ఇబ్బంది కలిగించే అంశమేదీ కనిపించలేదు. తుదకి "వస్తాను," అందావిడ ధైర్యంగా. లోకానికి వెలుతుర్ని చూపించే యముణ్ణి గూర్చి దుష్ప్రచారంచేసి, అతణ్ణి భీకరాకారుడుగా చిత్రించిన లోకాన్ని చూచి చిరునవ్వు నవ్వుకుంది ఆవిడ. 'యమరాజు మంచివాడు. దాటరాని వాగును దాటించి అవతలి వడ్డును చేర్చే తెప్పవాడు యముడు. అతనికి నిజంగా లోకం కృతజ్ఞతతో కేళ్లు మోడ్చాలిసింది. అనుకుంటూ ఆవులిస్తూన్నది ఆమె.

ఆమెచుట్టూ కూచున్నవాళ్ళంతా 'గొల్లు' మన్నారు. ఆమె ప్రయాణానికి ఆశ్చర్యపడనివాడు ఒక్కడే ఒక్కడు నిశ్చలంగా నిలబడి వున్నాడు. అతన్ని చూచి ఆశ్చర్యం వేసింది ఆమెకు. అతనే నిజమైన మనిషి. తాను వెలుగులోకి వెళుతూన్నందుకు దుఃఖించనివాడు. మిగతా వాళ్ళకి తాను నిద్రమేల్కొవడం ఇష్టం లేదేమో. ఎప్పుడూ ఈ అబద్ధాల నిద్రలోనే తనను పడేసి వుంచాలని వాళ్ళ కోరిక! మరి ఇతను అలా వాళ్ళమాదిరి బాధపడడేం?

యముడి దున్నపోతు పడుకుని వీపుసాచి ఆమె ఎక్కడానికి వీలిచ్చింది. నల్లని పరుపు రాతివంటి విశాలమైన ఆ కారు దున్న వీపులో ఏదో చకచకా మెఱుపు వుంది. ఆమె కొంత ఆయాసంగా కారు దున్న వీపుమీద కాలు మోపింది. ఆవులించింది. కళ్లు క్రమంగా విచ్చుకున్నాయి. దున్న పరుగెత్తుతోంది.

"కళ్లు మూసుకుంది. ఐపోయింది అయ్యో!" అన్నారు బంధువులంతా చుట్టు మూగి ఏడుస్తూ.

"కళ్లు తెరుచుకున్నాయి. ఇటు దక్షిణానికి చూడు తల్లీ! నాదేశం దక్షిణానికే వుంటుంది. మలయపర్వతం దక్షిణానికే. నాదేశంగాలి వస్తున్నది. ఇటు పక్కవాటుగా తూరుపునుంచి వెలుతుర్లుచూడు" అన్నాడు యముడు కారుదున్న మెడగంటల చప్పుడులో.

"నువ్వు మంచివాడవు ధర్మరాజా! ఈ కొంత కారుణ్యం చూపి, నన్ను నిద్రలేపినందుకు సంతోషం. అదిగో నల్లటితెర చూచావా మనకు వెనకనే ఎంతదూరాన వుండిపోయిందో అబ్బ! అంతనల్లగావుందేం ఆ తెర?" అందిఆమె.

"అది పొగతెర. తొలగించి ఇవతలకి తెచ్చానునిన్ను. ఇక నీకు నేను దారి చూప నక్కరలేదు. కానీ నాకు ఒక్క సందేహం. నిన్ను బాధించి నీ స్వప్న బంధువులనుండి దూరం చేశానేమో? నీకు వెలుతురును గురించి పరిచయం చేయడం జరిగింది. కనుక మళ్ళీ నిన్ను తీసుకు వెళ్ళి తెరవెనక వదిలి వస్తాను పద వెనక్కి!" అన్నాడు యముడు.

కారుదున్న వెనక్కి తిరిగింది.

"తెర వెనక్కి ఇప్పుడు వెళ్ళి బతకలేను. నేను చచ్చిపోతాను. నన్ను చంపుతావా ఇంతగా కాపాడి! ధర్మరాజా! నేను తెరవైపు రాను. కారుదున్న మీదినుంచి దూకిపోతాను. అమ్మో! చీకటివస్తున్నది. వస్తున్నది. నేను చీకటిలోకి రాలేను. రాలేను. రాలేను—" అంటూ కళ్లు మూసుకుంది ఆవిడ. కారుదున్న తెర దగ్గరగా నుంచుంది. పొగలు కక్కుతున్న తెరలోనుంచి పలచ పలచగా అవతలి లోకం కనపడుతున్నది. తన శరీరం కాల్చి, బూడిదచేసి ఆకాశంలోకి వూది ఏడుస్తో వెళ్ళిపోతున్నారు తన వాళ్లు.

"కళ్లు తెరిచాక తాను వాళ్ళకు అక్కర్లేదు కాబోలు. అందుకే తెరిచిన కళ్ళనూ, విరిసిన శరీరాన్నీ బూడిదచేసి, కసి తీర్చుకుని వెళ్ళిపోతున్నారు" అనుకుంది ఆవిడ.

"తెరలోంచి దూరిపోదామా?" అన్నాడు.

"వద్దు వద్దు. దక్షిణానికి త్రిప్పు మన సవారీని... అదో, అదో ... యమరాజా! ఆ నా శ్మశానపు పొగచాటున నిశ్చలంగావున్న మనిషి ఎవరు? కదలకండా నా యెడబాటును గూర్చి ఆలోచిస్తున్నాడు. ధర్మరాజా! అత నెవరు... అతను?" అంది ఆమె.

"అతడు నిజమైన నీవాడు" అన్నాడు యముడు. కోరుకున్న దక్షిణానికి సవారీ పోతున్నది. దాని మెడలోని దివ్య ఘంటల గలగల శబ్దంలో ఆమెకు మరేమీ వినపడలేదు. వెలుతురు చీరెలు కట్టుకుని, వెలుతురు నీరు తాగి, వెలుతురు తిని, దక్షిణానికి సునాయాసంగా ప్రయాణం చేస్తున్నది ఆమె.

ఆమె ప్రయాణం నీడలు దాటిపోయింది వెలుతురులోకి.

# "రాయలసీమ ఆర్థికాభివృద్ధి" : ఆంధ్రరాష్ట్రం

జి. జే. శామ్యూల్

శ్రీ యం. ఏబెల్, యం. ఏ, గారు "తెలుగు స్వతంత్ర" ఫిబ్రవరి 23వ తేదీ సంచికలో రాయలసీమ దురవస్థనుగూర్చి విపులముగా కనులకు గట్టినట్లు విశదీకరించి యున్నారు. వారు సందర్భానుసారముగా నుడివిన తెలుగు లోకోక్తులనుబట్టి విషయ మింకను సుబోధకమగుచున్నది. వారు సూచించిన నిర్మాణాత్మక ప్రణాళికగూడ ఆచరణీయమును, అత్యావసరముగా నమలు జరుపవలసిన విషయమునై యున్నది. విదేశములలో జరుగుచున్న ఆర్థికాభివృద్ధినిగూర్చి వివిధ విషయములన్నియు, ప్రత్యేక శ్రద్ధవహించి పెక్కు గ్రంథములను వారు పరిశోధించినారని తేట పర్చుచున్నవి. భారతదేశములో మధ్యభారత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ మొదలుగాగల భాగములందు చేయబడుచున్న కృషినిగూర్చియు వెల్లడించియున్నారు. దేశాభ్యుదయమునకు సంబంధించిన ముఖ్యముగా రైతు జనమునకు, దత్తమండలములకు సంబంధించిన యావద్విషయములు, కుటీర పరిశ్రమలనుండి భారీ పరిశ్రమలవరకు రైళ్ల నిర్మాణమునుగూర్చియు, ధాన్యపు గిడ్డంగులు కట్టవలసిన యావశ్యకతనుగూర్చియు, ఇది అది యననేల సమస్త విషయములనుగూర్చియు వివరించియున్నారు.

దేశాభ్యుదయమున కింతగా తహతహ పడుచున్న వీరు రాష్ట్రనిర్మాణమునకు విముఖులై యుండురనుటకు వీలుకాదు. చెన్నరాష్ట్రమునం దింతవరకునున్న దత్తమండలము లింతవరకు సమస్త సౌకర్యములలోను వెనుకకు నెట్టబడినట్లు వారంగీకరించుచునే యున్నారు. చెన్నరాష్ట్రములోని దక్షిణ మండలములతో సరిపోల్చినప్పుడు ఉత్తర సర్కారుల యభివృద్ధి కూడ గుంటపూవులు పూయుచున్నదని వారంగీకరింపకపోరు. కాని దీనికంతకు మూలకారణమేదియో వా రెరింగియేయున్నారు. అన్ని సంగతు లవగాహన చేసుకొనియును, "ఇతరులతో సాటి గౌరవ ప్రతిపత్తులందు కొనలేనంతవరకు రాయలసీమవారు ఆంధ్రరాష్ట్రానికి విముఖులే" యని నుడువుట యత్యంతవిస్మయమును, విచారమును కలిగించుచున్నది. ఇది యంతయు నెట్లున్నదనగా "పెండ్లయినగాని పిచ్చి కుదరదు. పిచ్చి కుదిరినగాని పెండ్లికాదు" దను ఆర్యోక్తిని స్ఫురింపజేయుచున్నది. "మొగిలిలోని నీరు మాచి, చెరువులోని నీరు పోగొట్టుకొనువారెవ్వరైనను గలరా" యని ప్రశ్నించుచున్నారు. ఆంధ్ర రాష్ట్రమునకు రాయలసీమవాసులు విముఖులై యున్నంతవరకు, వారు మద్రాసు రాష్ట్రముననే గదా వారుండవలసినది! ఇంతవరకును, నిప్పుడును ఉత్తరసర్కారులవారును, దత్తమండల వాసులును నుండనే యున్నారు. అందులో నుండగా మనకొలికినది యేదియును లేదని వాపోవుచునే యున్నాము. అట్టిస్థితిలో